## ఎస్సీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలి

ఎదులాపురం, మే 18: బెస్ట్ అవైలబుల్ పథకానికి సంబంధించి ఎంపికైన వివిధ పాఠశాలల్లో ఒకటో తరగతి (డే స్కాలర్), ఐదో తరగతి (రెసిడెన్షియల్)లో ప్రవేశానికి ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతిలో 45 సీట్లు, ఐదో తరగతి 47 సీట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఒకటో తరగతిలో ప్రవేశానికి 1 జూన్ 2018 నుంచి 31 మే 2019 మధ్య మాత్రమే జన్మించినవారు ప్రవేశాలకు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 18వ తేదీ నుంచి జిల్లా ఎస్సీ కార్యాలయంలో విద్యార్థి అన్ని ధృవీకరణ పత్రాలపై గెజిటెడ్ అధికారిచే అటెస్ట్ చేసి 7 జూన్ సాయంత్రం 5 గంటల వరకు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లక్కీ డ్రా ద్వారా విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. ఇతర వివరాలకు 9440628538 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## వైభవంగా వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవం

జైనథ్, మే 18 : గూడ గ్రామంలో గల శ్రీ లక్ష్మీపద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న వివిధ వేడుకల్లో భాగంగా ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో చేపట్టారు. శనివారం వేంకటేశ్వర స్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణాన్ని వీక్షించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ గోవర్ధన్, గూడ ఎంపీటీసీ తోట రమేశ్, డీసీసీబీ డైరెక్టర్ పురుషోత్తం, మాజీ సర్పంచ్ ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాలాభివృద్ధికి కృషి చేస్తా

తాంసి(తలమడుగు), మే 18 : బోథ్ నియోజకవర్గంలోని ఆలయాలాభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. శనివారం భరంపూర్ గ్రామ శివారులోని ప్రసిద్ధి చెందిన శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సన్మానించారు. అనంతరం బద్ది పోచమ్మ ఆలయ వార్షికోత్సవ కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కేదారేశ్వర్ రెడ్డి, అభిరాంరెడ్డి, సుదర్శన్ రెడ్డి, రమాకాంత్, రవికాంత్ యాదవ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

## గురుకులాల ఇంటర్ స్పాట్‌లో పాల్గొనాలి

ఉట్నూర్, మే 18: జిల్లాలోని గిరిజన గురుకుల కళాశాలలో 2024–25 ఇంటర్ ప్రథమ సంవత్సరానికి స్పాట్ అడ్మిషన్ల కోసం విద్యార్థులు పాల్గొనాలని ఐటీడీఏ పీవో ఖుష్బుగుప్తా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 23వ తేదీన స్థానిక బాలికలకు బాలికల కళాశాల ఉట్నూర్ కుమ్రంభీం కాంపెక్స్‌లో, బాలురకు ఈ నెల 25వ తేదీన లాల్‌టెకిడీ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. పదోతరగతి పూర్తయిన ఎస్టీ విద్యార్థులు కౌన్సెలింగ్‌లో హాజరుకావాలని కోరారు. విద్యార్థులు పదోతరగతి మెమో, బోనఫైడ్, టీసీ, కుల,ఆదాయ, ఫిజికల్ ఫిట్‌నెస్, ఆధార్, రెండు జత జిరాక్స్, 4 పాస్‌ఫొటో సైజ్ ఫొటోలతో రావాలని కోరారు. ఈ కౌన్సెలింగ్ ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు.

## నాణ్యతా ప్రమాణాలు పాటించాలి



పనులు పరిశీలిస్తున్న డీపీవో శ్రీనివాస్

కుంటాల, మే 18 : కుంటాల మండలం విట్టాపూర్, అందకూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపడుతున్న పనులను శనివారం జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ పరిశీలించారు. పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. నాణ్యతతో కూడిన పనులు చేపట్టాలని, పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జూన్ 5వ తేదీ లోపు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయన వెంట పంచాయతీరాజ్ డీఈ సురేశ్, ఏపీవో నవీన్, ప్రధానోపాధ్యాయుడు సాయినాథ్, పంచాయతీ కార్యదర్శి రమ్య ఉన్నారు.

# పాలోడిలో భగీరథ నీటి కష్టాలు..

- వారంలో మూడు రోజులే వస్తున్న నల్లాలు

తాంసి, మే 18 : వేసవి మొదలు కావడంతో తాంసి మండలం పాలోడి గ్రామంలో తాగునీటి కష్టాలు మొదలయ్యాయి. గ్రామంలో మిషన్ భగీరథ నీరు రాక ప్రజలు కష్టాలు పడుతున్నారు. వారంలో మూడు రోజులు భగీరథ నీరు వస్తున్నదని, ఒక రోజు వస్తే మరో రెండు రోజులు భగీరథ నీరు రావడం లేదు. భగీరథ నీరు సరఫరా కాని రోజు తాగునీటితో పాటు నిత్యావసరాలకు నీరు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మిషన్ భగీరథ నీళ్లు క్రమం తప్పకుండా ప్రతి రోజూ విడుదల చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు వెంటనే తగు చర్యలు తీసుకోకుంటే జిల్లా కలెక్టర్ దృష్టికి తమ సమస్యలు తీసుకెళ్తామని తెలిపారు.



భగీరథ నీళ్లు వస్తలేవని తెలుపుతున్న మహిళలు

# ప్రారంభానికి కేజీబీవీ భవనం సిద్ధం



భీంపూర్‌లో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ భవనం

భీంపూర్‌లో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వం రూ.3.50 కోట్లు మంజూరు చేసింది. 2021లో భవన నిర్మాణ పనులను అప్పటి ప్రజాప్రతినిధులు ప్రారంభించారు. పనులు పూర్తి కావడంతో ప్రారంభానికి సిద్ధంగా ఉంది.

-భీంపూర్, మే18

## జిల్లాకు చేరిన ఏకరూప దుస్తుల వస్త్రం

నిర్మల్ అర్బన్, మే 18 : నిర్మల్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు అందించే ఏకరూప దుస్తులకు సంబంధించిన మొదటి విడుత వస్త్రం శనివారం నిర్మల్ జిల్లాకు చేరుకుందని డీఈవో రవీందర్ రెడ్డి తెలిపారు. తెలంగాణ వస్త్ర పరిశ్రమల శాఖ నుంచి మొదటి విడుతగా ఒక జత దుస్తుల కోసం 150 బెయిల్లతో కూడిన వస్త్రం నిర్మల్‌కు వచ్చిందని దీనిని పట్టణంలోని సోఫినగర్ గురుకుల పాఠశాలలో భద్రపర్చడం జరిగిందన్నారు. డీఈవో రవీందర్ రెడ్డి, డీఆర్డీఓ విజయలక్ష్మి వస్త్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

నిర్మల్ అర్బన్, మే 18 : ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని పీఆర్టీయూ ఉపాధ్యాయ సంఘ నాయకులు శనివారం నిర్మల్‌లో జడ్పీ సీఈవో గోవింద్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల జీపీఎఫ్ ఫైనల్ లోన్లను తక్షణమే నిధుల విడుదలకు కృషి చేయాలని కోరారు. ఇక్కడ జిల్లా ప్రధాన కార్యదర్శి రవిరాజ్, హరిప్రసాద్, గంగాధర్, సుబ్రహ్మణ్యం ఉన్నారు.

## బోథ్‌లో 33,412 క్వింటాళ్ల జొన్నల కొనుగోలు

బోథ్, మే 18 : బోథ్ మార్కెట్ యార్డులో మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సహకార సంఘాల సహకారంతో శనివారం వరకు 33,412.50 క్వింటాళ్ల జొన్నలు కొనుగోలు చేసినట్లు కేంద్రం ఇన్‌చార్జి గోలి స్వామి తెలిపారు. ఆయా గ్రామాల 1536 మంది రైతులకు చెందిన 66,825 బస్తాల జొన్నలు కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. క్వింటాల్‌కు మద్దతు ధర రూ.3180 చెల్లిస్తూ కొంటున్నట్లు పేర్కొన్నారు.

## మౌలిక వసతుల కల్పనలో అశ్రద్ధ చేయకూడదు

ఖానాపూర్, మే 18 : గ్రామాల్లో చేపట్టే మౌలిక వసతులపై పంచాయతీ కార్యదర్శులు అశ్రద్ధ చేయరాదని ఖానాపూర్ ఎంపీవో చంద్రశేఖర్ సూచించారు. శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు. పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని, గ్రామాల్లో ప్రజలకు కనీస మౌలిక వసతుల కల్పనపై నిత్యం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయా గ్రామాల అభివృద్ధిపై కార్యదర్శులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఖానాపూర్ మండల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# నిబంధనలు పాటించని దవాఖానలపై చర్యలు



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్

నిర్మల్ చైన్‌గేట్, మే 18: ప్రభుత్వ నిబంధనలు పాటించని దవాఖానలపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్యాధికారి ధన్‌రాజ్ అన్నారు. నిర్మల్‌లోని ప్రైవేట్ దవాఖానలను శనివారం వైద్యాధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని దవాఖానలు, పాలిక్లీనిక్‌లు, నర్సింగ్ హోంలు, ఫిజియోథెరపి కేంద్రాలు ఐక్లినిక్‌లు, ఆయుర్వేద, యునాని, హోమియో, సిద్ధా, యోగా, నేచురోపతి వంటి అన్ని దవాఖానలు, డయాగ్నోస్టిక్ సెంటర్లు, క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ ప్రకారం తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దవాఖానలో అందిస్తున్న సేవల వివరాలు, చార్జిలు అన్ని డిస్‌ప్లే చేయాలన్నారు. నియమ నిబంధనలు పాటించని సాధన నర్సింగ్‌హోం, వాగ్భత ఆయుర్వేద దవాఖాన, సుప్రియ డయాగ్నోస్టిక్ సెంటర్‌కు నోటీసులు జారీ చేశారు. ఆయన వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్, మీడియ విస్తరణాధికారి బారె రవీందర్, సీనియర్ అసిస్టెంట్ సంతోష్, తదితరులు ఉన్నారు.

## కౌన్సిలర్ భర్త అరెస్టు.. రిమాండ్..

భైంసా, మే, 18 : రియల్ ఎస్టేట్ వ్యాపారిని డబ్బుల కోసం బెదిరించిన కేసులో భైంసా పట్టణానికి చెందిన కౌన్సిలర్ భర్త బాలాజీ సూత్రావేను శనివారం అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ రాజారెడ్డి తెలిపారు. పట్టణానికి చెందిన అరవింద్ రాహుల్ నగర్‌లో ప్లాట్లు చేసి విక్రయిస్తుండగా సదరు వార్డు కౌన్సిలర్ భర్త బాలాజీ సూత్రావే డబ్బులు డిమాండ్ చేసినట్లు తెలిపారు. రూ. 20 లక్షలు ఇస్తేనే ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయనిస్తానని లేదంటే చంపుతానని బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీంతో బాధితుడు అప్పు చేసి రూ. 10 లక్షలు ఇవ్వగా మరో రూ. 10 లక్షలు సర్దుబాటు కాకపోవడంతో నేతాజీనగర్‌లోని ప్లాట్లు రిజిస్ట్రేషన్ కాకుండా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఫిర్యాదు చేశాడు. మిగిలిన డబ్బులు ఇవ్వాలని బెదిరించడంతో బాధితుడు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి శనివారం అరెస్టు చేసి రిమాండ్ తరలించామన్నారు.

నమస్తే తెలంగాణ
CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు, ఇంటిపని, వంటపని చేయుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. Ph: 8977639662 / 8977639663.
NT-327714-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677

## ఘనంగా వాసవీ కన్యకా పరమేశ్వరీ జయంతి



పూజలు చేస్తున్న భక్తులు

సోన్, మే 18: సాకెర గ్రామ శివారులో గల శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ జయంతిని శనివారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారికి 16 కలశాలతో అభిషేకం, అలంకరణ, కుంకుమపూజ, అమ్మవారి పారాయణం, ఉయ్యాల, పల్లకీ సేవ కార్యక్రమాలు నిర్మల్ ఆర్యవైశ్య సోదరి సోదరులు నిర్వహించారు. అనంతరం అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు అమెడ కిషన్, కమిటీ సభ్యులు ముత్యం సంతోష్‌గుప్తా, చింతకుంట గంగాధర్, పుల్లూరి రాజకిషన్, సదానంద్, గుండ రమేశ్, గుజ్జులవారి కిషన్, మహిళా కమిటీ సభ్యులు, ఆమెడ హర్షన, కమలేశ్వరి నరేందర్, ఉత్తూరి భార్గవి, లత, వాసవీమాత భక్తులు పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

నర్సాపూర్(జి), మే18: ప్రభుత్వం రైతుల నుంచి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, కోతలు ఆపాలని, రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దుర్గం నూతన్ కుమార్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతుల సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి కొనుగోలు కేంద్రాల్లో తాలు పేరుతో అధికంగా కోతలు విధిస్తున్నారని అన్నారు. ఇకనైనా కనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న అవినీతిని అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు డాకూర్ తిరుపతి, చందుల సాయికిరణ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## దాడి చేసిన వారిపై కేసు నమోదు చేయాలి




మాట్లాడుతున్న దుర్వ విశ్వేశ్వర రావ్, అమృత్‌రావ్

బోథ్, మే 18 : జైనూర్‌లో ఈ నెల 13వ తేదీన ఆదివాసీ గిరిజనుడు మర్సుకోల లక్ష్మణ్‌పై దాడి చేసిన వారిపై ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని తుడుందెబ్బ బోథ్ డివిజన్, మండలాధ్యక్షుడు దుర్వ విశ్వేశ్వరరావ్, అమృత్‌రావ్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆదివాసీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇలాంటి దాడులు జరగకుండా చూడాలన్నారు. లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో జిల్లా కమిటీ సలహాదారుడు పంద్రం శంకర్, మండల కమిటీ నాయకులు పంద్రం సోనేరావ్, నల్లోల శ్రీనివాస్, తొడసం కైలాస్, సిడాం రామపలకు, భీంరావ్, మడావి నాగోరావ్, కేశవ్, గంగాధర్ పాల్గొన్నారు.

## కొనుగోళ్లు వేగవంతం చేయాలి

కుంటాల, మే 18 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ గోడం హన్మండ్లు అన్నారు. మండలంలోని అందకూర్, కుంటాల, కల్లూర్, లింబా(కే), లింబా (బీ)లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట పీఏసీఎస్ సిబ్బంది శ్రీనివాస్ రెడ్డి, మహేశ్, కృష్ణ ఉన్నారు.



కుంటాల కొనుగోలు కేంద్రంలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న డీటీ హన్మండ్లు

# తండాలో తాగునీటి సమస్య

నర్సాపూర్(జీ), మే 18: సాయినగర్ తండాలో తాగునీరు లేక గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పరిసరాల్లో వేసిన బోర్‌వెల్ పైపుల లీకేజీలతో రెండు నెలలుగా తాగునీరు అందడం లేదు. మిషన్ భగీరథ నల్లాల ద్వారా వస్తున్న నీరు తాగడానికి అనువుగా లేవని తాగునీటి కోసం ఆలయంలో ఉన్న బోర్ నుంచి తీసుకెళ్తున్నామని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆదేశిస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



లీకేజీలతో పని చేయక నిరుపయోగంగా బోర్‌వెల్

## విద్యార్థినికి సన్మానం



విద్యార్థినిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

తాంసి(తలమడుగు), మే 18: విద్యార్థులు చదువుపై ప్రత్యేక దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. శనివారం తలమడుగు మండలం భరంపూర్ గ్రామానికి చెందిన మాడూరి మల్లన్న కుమార్తె మల్లీశ్వరి ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో కళాశాల టాపర్ రావడంతో ఆమెను సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు కేదారేశ్వర్ రెడ్డి, రజినీకాంత్, ప్రీతమ్‌రెడ్డి పాల్గొన్నారు.

## కంది శ్రీనివాస్‌రెడ్డి వ్యాఖ్యలు సమంజసంకాదు




మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్

ఎదులాపురం, మే 18 : బీసీ నేతలపై కుల దురాహంకారంతో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేశ్ అన్నారు. శనివారం ఆదిలాబాద్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ సామాజికవర్గానికి చెందిన నాయకురాలు గంద్రత్ సుజాత, మాజీ మంత్రి జోగు రామన్న, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌పై కంది శ్రీనివాస్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు సమంజసంకాదన్నారు. వీటిని ప్రజలు సహించరని హెచ్చరించారు. సమావేశంలో పట్టణ నాయకులు మనోజ్, నవీన్, సురేందర్, తదిరతులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలి



కూలీలతో కలిసి పనులు చేస్తున్న ఎంపీడీవో బాల గంగాధర్

ఇచ్చోడ(సిరికొండ), మే 18 : అర్హులైన ప్రతి ఒక్కరూ ఉపాధి హామీ పనులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో బాల గంగాధర్ అన్నారు. సిరికొండలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాబ్ కార్డు కలిగిన వారు ఉపాధి హామీ పనులు చేయాలన్నారు. వేసవికాలం దృష్ట్యా ఉదయం, సాయంత్రం సమయాల్లో కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. కూలీలతో కలిసి పనులు చేశారు. అలాగే ఇచ్చోడలో ఉపాధి హామీ కూలీలు చేస్తున్న చెరువు పనులను ఏపీవో నరేందర్ గౌడ్ పరిశీలించారు. ఆయన వెంట ఏపీవో భీంరావ్, టీఏ స్వరూప, ఎఫ్ఏ ఈశ్వర్, ఎఫ్ఏ బలరాం ఉన్నారు.

## పురుగుల మందు డబ్బాతో రైతుల నిరసన

ఎదులాపురం, మే 18: ఆదిలాబాద్ పట్టణంలోని ప్రధాన పోస్టాఫీస్ కార్యాలయం ఎదుట శనివారం పురుగుల మందు డబ్బాలతో రైతులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, సుమారు 79 మంది రైతులు పత్తి అమ్మిన డబ్బులు పోస్టాఫీస్ ఖాతాల్లో జమ కాగా, మేనేజర్ విజయ్ జాదవ్ నాలుగు నెలల క్రితం సొంతానికి వాడుకున్నట్లు పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపిన అధికారులు మీ ఖాతాల్లో డబ్బులు జమ చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటి వరకు డబ్బులు జమ కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న పోస్టాఫీస్ సిబ్బంది జీఎం జనార్దన్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. ఈ నెలాఖరులోగా లేదా వచ్చే నెలలో డబ్బులు జమవుతాయని భరోసా కల్పించారు. రైతులు ధర్నాను కొనసాగించడంతో పోలీసులు వచ్చి సముదాయించారు.

## కిక్ బాక్సింగ్ కిట్ అందజేత

నిర్మల్ అర్బన్, మే 18 : ఖానాపూర్ మండలం సింగపూర్ గ్రామానికి చెందిన గాజుల నాగలక్ష్మి కిక్ బాక్సింగ్‌లో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. పూణెలో ఈ నెల 21వ తేదీన జరుగనున్న జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు వెళ్లేందుకు ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్న విషయం తెలుసుకున్న నమస్తే తెలంగాణలో ఆర్థిక సాయం అందించరూ కథనం ప్రచురితమైంది. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ నాగలక్ష్మికి కిక్ బాక్సింగ్‌కు అవసరమయ్యే రూ.10వేల కిట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా నమస్తే తెలంగాణ, జాన్సన్ నాయక్‌కు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

## ఘనంగా ఆలయ వార్షికోత్సవం

నిర్మల్ అర్బన్, మే 18 : నిర్మల్‌లోని కళానగర్ కాలనీలోని నిమిషాంబ ఆలయ 17వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అభిషేకం, హారతి, యజ్ఞం వంటి పూజలు నిర్వహించారు. రాత్రి పట్టణ పుర వీధుల్లో పల్లకీ ఊరేగించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కల్లూరులో వారసంత

కుంటాల, మే 18 : కల్లూరులో ప్రతి గురువారం వారసంత నిర్వహించనున్నట్లు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. ఈ నెల 23 నుంచి ప్రారంభమయ్యే ఈ సంతలో కూరగాయలు, పండ్లు, ఇంటి సామగ్రి అందుబాటులో ఉంటాయని, పరిసర ప్రాంత వ్యాపారస్తులు, రైతులు, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## టీఎస్‌కు బదులు టీజీ రాయాలి

ఎదులాపురం, మే 18 : తెలంగాణ రాష్ట్రంలో ఇకపై టీఎస్‌కు బదులుగా టీజీగా మార్చాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని కలెక్టర్ రాజర్షి షా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవోలు, నోటిఫికేషన్లు, నివేదికలు, లెటర్‌హెడ్‌లతో టీజీగా ఉండాలని ప్రభుత్వ శాఖలు, సంస్థలు, అటానామస్ విభాగాలు దీనిని పాటించాలని ఆదేశించారు. టీఎస్‌కు బదులుగా టీజీగా మార్చి 26వ తేదీలోగా నివేదికలు సమర్పించాలని శాఖల అధికారులను ఆదేశించారు.

## కల్తీకల్లును వెంటనే నిర్మూలించాలి

ఎదులాపురం, మే 18 : జిల్లాలోని పలు గ్రామాల్లో కల్తీకల్లు విక్రయాలు జోరుగా కొనసాగుతున్నా సంబంధిత అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆదివాసీ భారత్ మహాసభ అధ్యక్షుడు కినక సురేశ్ అన్నారు. శనివారం ఆదిలాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఈత చెట్లు కల్లు పేరు చెప్పి ప్రజల ఆరోగ్యాలతో విక్రయదారులు చెలగాటమాడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కల్తీకల్లును వెంటనే నిర్మూలించాలన్నారు. నాయకులు గేడం దీపక్, వినోద్, వామన్, రమేశ్, ప్రదీప్, సకారాం పాల్గొన్నారు.

## పేర్లు తొలగించాలని వినతి

ఎదులాపురం, మే 18 : బోథ్ నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించినప్పటికీ ఎన్నికల అధికారుల నుంచి జారీ చేసిన షోకజ్ నోటీసుల నుంచి పేర్లు తొలగించాలని పీఆర్టీయూ జిల్లా శాఖ నాయకులు కోరారు. శనివారం రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్యామలాదేవికి పీఆర్టీయూ జిల్లా శాఖ నుంచి వినతిపత్రం అందజేశారు

## ఏడుగురు అరెస్టు

సారంగాపూర్, మే 18: బీరవెల్లిలో పేకాట ఆడుతున్న ఏడుగురిని పట్టుకున్నట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు. బీరవెల్లి గ్రామానికి చెందిన మేడ దయాకర్, కులం గణేశ్, సయూద్ బాబు, షైక్ రసూల్, తాండ్ర సాయన్న, శంకర్, బొడ్డు మహేందర్ పేకాట ఆడుతున్నారని పక్కా సమాచారంతో దాడి చేసి పట్టుకున్నట్లు ఎస్ఐ చెప్పారు. వీరి వద్ద నుంచి రూ. 31వేలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. పేకాటదాడిలో ఎస్ఐతో పాటు కానిస్టేబుళ్లు మనోజ్, లింగుర్రాం, రాజాగౌడ్, వినోద్, మాధవ్, హోంగార్డు నవీన్ చాకచక్యంగా పట్టుకున్నందుకు రూరల్ సీఐ శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు.

## కాలువలో పడి ఒకరి మృతి

లక్ష్మణచాంద, మే 18 : లక్ష్మణచాంద మండలం వడ్డేపల్లి గ్రామానికి చెందిన పల్లపు బక్కోళ్ల చిన్న రాజన్న(52) కాలువలో పడి మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. వ్యవసాయం చేసుకుంటున్న రాజన్న శనివారం రాచాపూర్ శివారులో గల మాటుకాలువ నందు కాలకృత్యాలకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు కాలువ ఒడ్డుపై నుంచి జారి కిందపడడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ తెలిపారు


## మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

భైంసా, మే 18: పట్టణంలోని కోర్వగల్లికి చెందిన జింక సతీశ్ (35) శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ ఎండీ గౌసొద్దీన్ వివరాల ప్రకారం.. బోధన్‌కు చెందిన సతీశ్ ఉపాధి నిమిత్తం మూడు నెలల కిందట భైంసాకు కుటుంబంతో సహా వలస వచ్చాడు. ఈ క్రమంలో మద్యానికి బానిస కావడంతో శుక్రవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారమందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా దవాఖానకు తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

నిర్మల్ టౌన్, మే 18 : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గిరిజన గురుకులల్లో ఇంటర్ ప్రవేశాలకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఐటీడీవో పీవో ఖుష్బుగుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ హెచ్‌ఈసీ కోర్సుల్లో ప్రవేశాలను నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఈ నెల 23వ తేదీ వరకు దరఖాస్తు చేసుకున్న వారికి 25న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ఎస్టీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## క్రీడాకారిణికి ఆర్థిక సాయం



క్రీడాకారిణికి ఆర్థిక సాయం అందజేస్తున్న నాయకులు

ఖానాపూర్ రూరల్, మే 18: మండలంలోని సింగాపూర్ గ్రామానికి చెందిన గాజుల నాగలక్ష్మి అనే క్రీడాకారిణికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఆదేశాల మేరకు మండల నాయకులు శనివారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 21న పుణేలో నిర్వహించే జాతీయ స్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపిక కావడంతో ఆర్థికంగా ఇబ్బందులకు గురికాకుండా చేయుతనిచ్చినట్లు నాయకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు దయానంద్, రమేశ్, సచిన్, శంకర్, రాజునాయక్ గ్రామస్తులు పాల్గొన్నారు.